విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేత

రాయచోటి టౌన్ : వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. మంగళవారం రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ కంటి వెలుగు – అంధత్వ నివారణ పథకం ఫేజ్ –3 ద్వారా 26 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా అంధత్వ నివారణ పథకం అన్నమయ్య జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ రియాజ్ బేగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంధత్వ నివారణ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెప్పారు. ఈ క్రమంలో చిన్నారులలో అంధత్వ నివారణ కోసం కంటి పరీక్షలు నిర్వహించి కళ్లను ఎలా కాపాడుకోవాలనే విషయాలపై సలహాలు సూచనలు అందించడంతో పాటు వైద్యం, కళ్ల అద్దాలు అందిస్తున్నామన్నారు. ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జానకీ, ఉపాధ్యాయులు శెట్టెం ఆంజనేయులు, వెంకటనారాయణ, ఎస్‌డీపీ రంజిత, సలీమా, సావిత్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి

సంబేపల్లె : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలపై రూరల్ సీఐ లింగప్ప ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న గ్రామీణ రహదారులను జాతీయ రహదారి అధికారులతో కలిసి పరిశీలించి, అవసరమైన చోటు వేగ నిరోధాల ఏర్పాట్లను సూచించారు. అలాగే రహదారి భద్రతకు సంబంధించి ఏర్పాటుపై జాతీయ రహదారి వెంట పలు ప్రాంతాలను గుర్తించారు.

విప్లవాత్మక మార్పులతో జగన్ పాలన

– గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


రాయచోటి: ప్రభుత్వ సంక్షేమాన్ని తెలియజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


సంబేపల్లె: జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

రాయచోటి : అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు లాంటివని వైఎస్ఆర్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. రాయచోటి మునిసిపాలిటీలోని 19వ వార్డు పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. లక్ష్మీపురం, దూదేకులపల్లె, సరస్వతి వీధి, గాలివీడు రహదారి మార్గాలలో ఇంటింటికెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలపై శ్రీకాంత్‌రెడ్డి ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విప్లవాత్మక మార్పులతో జగన్ పాలన సాగుతోందన్నారు. అంతకు ముందు గడప గడపకు విచ్చేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని దూదేకులపల్లె ప్రజలు అక్కున చేర్చుకున్నారు. దూదేకులపల్లెలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలన్న స్థానికుల విన్నపంపై శ్రీకాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

లక్ష్మీపురంను అభివృద్ధి చేస్తాం

లక్ష్మీపురంలో అన్ని రకాలుగా మౌలిక వసతులను కల్పిస్తామని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే తెలిపారు. లక్ష్మీపురంలోని అన్ని వీధులలో ఇంటింటా శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. అభివృద్ధి పనులు, సమస్యలపైన చర్చించారు. మేజర్ వాటర్ డ్రైన్‌ను నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేశారు. భూగర్భ డ్రైనేజీ, రహదారుల నిర్మాణాలను చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్ జయన్ననాయక్, భాస్కర్, పల్లా రమేష్, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, ఆర్ట్స్ శంకర్, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

మే 5న నల్ల గంగమ్మ జాతర

సంబేపల్లె : జిల్లాలో ప్రసిద్ధ ఆలయమైన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ జాతరను పురస్కరించుకొని మంగళవారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నల్లగంగమ్మ తిరునాల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మే 5వ తేదీ మొలకల పౌర్ణమి రోజులన నల్లగంగమ్మ తిరునాలను నిర్వహించునున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అమ్మవారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయచోటి టౌన్ :పేదలకు సీఎం సహాయ నిధి వరమని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రెండు చెక్కులను ఆయన పేద కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ నేపథ్యంలో సంబేపల్లె మండల కేంద్రంలోని షేక్ బాషాకు రూ.2.5లక్షలు, గాలివీడు మండలం కొర్లకుంట గ్రామం నాయనివారిపల్లెకు చెందిన మహేంద్రరెడ్డికి రూ. 75 వేలు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

బైక్‌ల చోరీ ముఠా సభ్యుడి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, నిందితుడితో డీఎస్పీ కేశప్ప, సీఐ మురళీకృష్ణ

మదనపల్లె : ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి రూ.10 లక్షలు విలువ చేసే 14 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కేశప్ప వెల్లడించారు. మంగళవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఇటీవల మదనపల్లె పట్టణ, మండలంలో ద్విచక్రవాహనాల చోరీ కేసులు అధికంగా నమోదు కావడంతో టూటౌన్ సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంతో దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. మంగళవారం ఉదయం మదనపల్లె పట్టణంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో గుర్రంకొండ మండలం సంగసముద్రం పంచాయతీ కొత్తపల్లెకు చెందిన కమాల్‌బాషా కుమారుడు పఠాన్ నూర్‌మహ్మద్(28) అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, మదనపల్లె పట్టణం దేవళంవీధికి చెందిన షేక్ అదీద్‌హుస్సేన్ అలీ కుమారుడైన షేక్ సైషాఅలీతో కలిసి బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించాడు. అతను తెలిపిన వివరాల మేరకు గుర్రంకొండ మండలం సంగసముద్రం పంచాయతీ కొత్తపల్లె అటవీప్రాంతంలో నిందితులు దాచి ఉంచిన 14 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల్లో ఒకడైన నూర్ మహ్మద్ ఎలక్ట్రీషియన్‌గా , డ్రైవర్‌గా పని చేస్తూ ద్విచక్రవాహనాలు చోరీ చేసి సైషాఅలీకి అప్పగించేవాడన్నారు. వాటిని విక్రయించిన తర్వాత వచ్చిన నగదు ఇరువురు పంచుకునేవారు. కేసులో ప్రధాన నిందితుడైన షేక్ సైషాఅలీ పరారీలో ఉండగా, అతని కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితున్ని త్వరలోనే పట్టుకుంటామన్నారు. స్ప్లెండర్ – 05, ప్యాషన్‌ప్రో – 08, హోండా షైన్ – 01, మొత్తం రూ.10 లక్షలు విలువైన 14 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మదనపల్లె టూటౌన్‌లో 10, తాలూకా పోలీస్‌స్టేషన్‌లో రెండు ద్విచక్రవాహన చోరీలపై కేసులు నమోదయ్యాయన్నారు.బైక్‌ల చోరీ కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన టూటౌన్ సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ జి.చంద్రమోహన్, హెచ్‌సీ శంకర, పోలీసు సిబ్బంది మునిరత్నం, రెడ్డిప్రసాద్, భద్రనాయక్, రెడ్డిశేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

ఆటో, ద్విచక్రవాహనం ఢీ కొని..

చిన్నమండెం : మండల పరిధిలోని కడప – బెంగళూరు జాతీయ రహదారిపై హిందుస్థాన్ పెట్రోల్ బంకు వద్ద ఆటో ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. కలిబండకు చెందిన భార్యాభర్తలు ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంలో రాయచోటి వైపు నుంచి చిన్నమండెం బయలుదేరారు.

ఈ సమయంలో చిన్నమండెం వైపు నుంచి పెట్రోల్ బంకులోకి వెళ్తున్న ఆటోను ద్విచక్రవాహనం ఢీ కొనడంతో దంపతులకు గాయాలైనట్లు తెలిపారు. క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కారు, ట్రాక్టర్ ఢీకొని..

రాయచోటి టౌన్ : పట్టణంలోని మదనపల్లె రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ జనార్ధన్ రెడ్డికి గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి మదనపల్లె వైపు నుంచి రాయచోటికి వస్తున్న కారును రాయచోటి పట్టణం నుంచి మదనపల్లె రోడ్డు వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న జనార్ధన్‌రెడ్డికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

ఆస్తి కోసం అన్నను కొట్టిన తమ్ముళ్లు

ఒంటిమిట్ట: మండల పరిధిలోని మండపంపల్లె గ్రామంలో ఆస్తి కోసం తమ్ముళ్లు అన్నను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. ఒంటిమిట్ట మండలం మండపంపల్లె గ్రామంలో విజయభాస్కర్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి అన్నదమ్ముళ్లు. వారిలో విజయభాస్కర్‌రెడ్డి పొలం కావాలని తమ్ముళ్లను అడిగాడు. తాము నిమ్మ తోట వేసుకున్నామని, పొలం ఇచ్చేది లేదని చెప్పడంతో ఆగ్రహించిన అన్న అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన నిమ్మకాయల మూటల్లో ఒక దానిని ఎత్తుకెళ్లాడు.దీంతో ఆగ్రహించిన తమ్ముళ్లు అన్నను చెట్టుకు కట్టేసి కొట్టారు.గమనించిన విజయభాస్కర్‌రెడ్డి కుమార్తె పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీనిపై రెండు వర్గాల నుంచి ఫిర్యాదు అందడంతో విచారణ చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

బీజేపీ పాలనలో ప్రమాదంలో దేశం


ర్యాలీ చేస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : మోడీ ప్రభుత్వాన్ని దించి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గజ్జల ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం ఆ పార్టీ నేతలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనతో దేశం ప్రమాదంలో పడిందన్నారు. అన్నదమ్ముల్లా బతకాల్సిన దేశ ప్రజలు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కూటమి మతద్వేషాలతో చిచ్చు రాజేస్తోందన్నారు. ప్రజల సంపదగా ఉన్న బ్యాంక్‌లను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను, ఓడరేవులను, చివరికి వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్ వ్యక్తులకు దారదత్తం చేస్తోందని ఆరోపించారు.

పత్రికా ప్రకటన

18.04.2023, రాయచోటి

అన్నమయ్య జిల్లా పరిధిలో ఉన్నటువంటి 9 ఐ.సి.డి.యస్ ప్రాజెక్టులకు సంబంధించి 7 నెలల నుంచి 3 సంవత్సరముల పిల్లలకు ఐ.సి.డి.యస్ ప్రాజెక్ట్ కార్యాలయము నుంచి అంగన్వాడీ కేంద్రములకు బాలామృతమును సరఫరా చెయ్యుటకు టెండరు పిలవడం జరిగినది.

ఇందుకు సంబంధించి జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి వారి కార్యాలయము నందు 19.04.2023వ తేదీ నుంచి 23.04.2023 వ తేదీ వరకు టెండర్ షెడ్యూలు లభించును. 24.04.2023వ తేదీ నుంచి 26.04.2023 వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు టెండరు డాక్యుమెంట్లు స్వీకరించబడును. 27.04.2023 వ తేదీన జిల్లా సర్వోన్నత అధికారి వారి కార్యాలయము నందు టెండరు తెరువబడును. ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోగలరు. వివరములకు జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి వారి కార్యాలయము నందు సంబంధిత అధికారులను సంప్రదించగలరు ఫోన్ నంబరు: 8074390654 & 7893791910.

* షరతులు వర్తిస్తాయి.

సం/- : జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి
అన్నమయ్య జిల్లా, రాయచోటి.

సుఖ సంతోషాలు వెల్లివిరియాలి

రాయచోటిలో దుస్తులు, గాలివీడు, రాజంపేటలలో రంజాన్ కానుకల పంపిణీ


ముస్లింలకు రంజాన్ కానుకను అందజేస్తున్న దృశ్యం

రాయచోటి : రంజాన్ మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని అన్నమయ్య జిల్లా రాయచోటిలో జిల్లా వైఎస్సార్‌సీపీ విభాగం మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహ్మద్‌ఖాన్ ఆర్థిక సాయంతో పేద, మధ్య తరగతి ప్రజలకు దుస్తులు పంపిణీ చేశారు. మంగళవారం రాయచోటి పట్టణ పరిధిలోని కొత్తపల్లిలో కుల, మతాలకు అతీతంగా బట్టలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కొత్తపల్లి ఇంతియాజ్, బేపారి జబివుల్లాఖాన్, బేపారి అసద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

నందలూరు(రాజంపేట) : ముస్లింల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్ అన్నారు. మంగళవారం నాగిరెడ్డిపల్లె అర్బన్‌లోని తోటపాళెంలో నిరుపేద ముస్లింలకు ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను అందజేశారు. కార్యక్రమంలో ఏజీపీ షమీవుల్లా, వైఎస్సార్‌సీపీ నేత నడివీధి సుధాకర్, తాజ్ సూపర్ మార్కెట్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడులో..


గాలివీడు : రంజాన్ పండుగ సందర్భంగా గోపనపల్లె సర్పంచ్ కామసాని చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన రంజాన్ కానుక పంపిణీ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషణ్ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే ఖాదర్ మొహిద్దీన్‌లతో కలిసి ఎంపీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ కానుక పంపిణీ చేయడం అభినందనీయమని వారు తెలిపారు. గ్రామంలో చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో 150 కుటుంబాలకు రంజాన్ కానుకను అందజేశారు.

ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

రాయచోటి టౌన్ : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని నివారించేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అగ్నిమాపక విభాగం అధికారి వెంకట్రామిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయిల్ ఫిలింగ్ (పెట్రోల్ బంకులు) లలో అగ్నిప్రమాదాలపై వినియోగదారులకు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లె : గ్యాస్ గోదాం వద్ద అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అక్కడ పనిచేస్తున్న సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక అధికారి బాల హుస్సేనయ్య అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం లక్కిరెడ్డిపల్లె హెచ్‌పీ పెట్రోల్ బంక్‌తోపాటు హెచ్‌పీ గ్యాస్ గోదాం వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు.

అభివృద్ధి పథం.. సంక్షేమమే లక్ష్యం


రైల్వేకోడూరు అర్బన్: వృద్ధురాలితో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో గ్రామాలలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతూ మా భవిష్యత్తు నువ్వే జగన్ అంటూ ఆనందంగా సంప్రదిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. మండలంలోని రాఘవరాజపురం పరిధిలో కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమాన్ని తెలియజేస్తూ.. పథకాల గురించి ఆరా తీస్తూ.. సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. అనంతరం ప్రతి ఇంటికి స్టిక్కర్లను అతికించారు.

నందలూరు(రాజంపేట) : పొత్తపిలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీటీసీ మోదుగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కొనసాగింది. మండల సచివాలయాల కన్వీనరు కలీం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధానకార్యదర్శి నడివీధి సుధాకర్, మండల ఉపాధ్యక్షుడు టీబీ శ్రీధర్‌గౌడ్, సచివాలయకన్వీనరు చంద్ర తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


మధు (ఫైల్)

కురబలకోట: కురబలకోట మండలం అంగళ్లలోని ఓ కళాశాలలో సీఎస్ఈ బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న మధు (21) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. పీటీఎం మండలం అంగడివారిపల్లెకు చెందిన కుదుం ఉత్తన్న కుమారుడు మధు చదువుల్లో మేటి. పదిలో ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. ఇంటర్‌లో కూడా రాణించాడు. అంగళ్లలోని ఓ కళాశాలలో ఇతనికి సీఎస్ఈలో ఫ్రీ సీటు వచ్చింది. తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సహ విద్యార్థులతో బాగా కలసిపోయే వాడు. అంగళ్లలో రూము అద్దెకు తీసుకుని కళాశాలకు రాకపోకలు సాగించేవాడు. ఈనేపథ్యంలో ఈనెల 12న సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాడు. రూముకు రాకపోవడంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కూడా చుట్టుపక్కల విచారించారు. సెల్ ఫోన్ కూడా రూములో వదిలి వెళ్లాడు. ఇతని ఆచూకీ కోసం కుటుంబీకులు పలుచోట్ల గాలించారు. ఎక్కడైనా ఉంటాడులే అని భావి స్తూ వచ్చారు. మంగళవారం ఉదయం అంగళ్లలోని తుమ్మచెట్లపల్లె వద్ద ఉన్న కోల్డ్‌స్టోరేజీ వెనుక వైపు ప్రాంతంలో దుర్వాసన రాసాగింది. స్థానికులు పరిశీలించి చూడగా కుళ్లిన స్థితిలో శవం కన్పించింది. మృతుడి దుస్తులు, చెప్పుల ఆధారంగా అదృశ్యమైన మధుగా గుర్తించారు. పక్కన టమాటా పంట వద్ద ఉన్న డ్రిప్ వైరుతో ఇతను చెట్టుకు ఉరి వేసుకున్నట్లు సంఘటన స్థలాన్ని బట్టి స్పష్టమవుతోంది. ముట్టుకుంటే ఊడిపోయే పరిస్థితి కావడంతో డాక్టర్లు మంగళవారం సంఘటన స్థలానికి వచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. మృత దేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.













వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ముద్దులూరు సుబ్బరామరాజు

– నేడు రైల్వేకోడూరులో ఘనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం



రైల్వేకోడూరు : రైల్వేకోడూరు నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా మండలంలోని కోనేటిరాజు కండ్రిగకు చెందిన ముద్దులూరు సుబ్బరామరాజు నియమితులయ్యారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ఘనంగా ప్రమాణస్వీకార సభను చేయనున్నారు. చిన్ననాటి నుంచే సుబ్బరామరాజు సేవా గుణం కలిగిన వ్యక్తి. విద్యాభ్యాసం అనంతరం తను పుట్టిన గ్రామానికి, చుట్టుపక్కల గ్రామాలకు ఏదో చేయాలనే ఉద్దేశంతో ఆయా గ్రామాలలో సమస్యలు గుర్తించి నాయకులు, అధికారులతో మాట్లాడి పరిష్కరించేవారు. ముఖ్యంగా రైల్వేకోడూరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనుచరుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అందులో భాగంగానే 20 సంవత్సరాల క్రితమే వైఎస్ జగన్ యూత్ కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టి క్రియాశీలకంగా పని చేశారు. అలాగే వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించి, పథకాల అందనివారిని గుర్తించి వారికి పథకాలు అందేలా కృషి చేశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సుబ్బరామరాజు సేవలు, తాను చేసిన సేవాలను గుర్తించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నియామకమయ్యేలా సహకరించారు.

ముమ్మరంగా ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రానున్న సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా ప్రమాణస్వీకారానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.









